క్లుప్తంగా

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం

చీరాల టౌన్‌: భూముల రీ సర్వేతో ప్రజలకు ఎనలేని మేలు జరగడంతో పాటు భావిత రాలకు భూ సమస్యలు లేకుండా ఉంటాయని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే జీవీ ముసలయ్య అన్నారు. శనివారం చీరాల నగర్ గ్రామ పంచాయతీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు భూముల రీసర్వే ప్రాజెక్టులో భాగంగా సర్వే చేశారు. ఆర్డీవో టి.చంద్రశేఖర నాయుడు ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బంది భూముల రీ సర్వే వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. మండలంలో 29,121 ఎకరాల భూములు రీ సర్వే చేయాల్సి ఉండగా 7925 ఎకరాల్లో చేశామన్నారు. మిగిలిన భూములు మార్చి 31లోపు రీసర్వే పూర్తి చేస్తామని చెప్పారు. మండల సర్వేయర్ చెరుకూరి బ్రాహ్మణయ్య, సచివాలయాల సర్వేయర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


స్వర్ణ గ్రామంలో వేస్తున్న సీసీ రోడ్డు పరిశీలిస్తున్న డీఈ ఆదినారాయణ


కారంచేడు: సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయితీరాజ్ డీఈ ఆదినారాయణ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్మాణాల్లో ఉన్న సీసీ రోడ్లను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎంత ఎత్తులో వేయాలి, ఎంత వెడల్పులో ఉండాలి, ఎంత పొడవు ఉండాలో సరిచూసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా, నాణ్యతలో డొల్లతనంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని, బిల్లులు సైతం నిలుపుదల చేస్తామని ఆయన హెచ్చరించారు. స్వర్ణ గ్రామంలో వేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

పేకాట శిబిరంపై దాడి

మార్టూరు: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని రాజుగారి పాలెం గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. మామిడి తోటలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని ముందస్తు సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. నాలుగు ద్విచక్ర వాహనాలను పోలీస్ స్టేషన్కు తరలించారు.

ఒత్తిడి దూరం.. విజయం పదిలం

- ఈ ఏడాది పదో తరగతి పరీక్షల మధ్య విరామం
- ఆరు సబ్జెక్టులు.. ఏడు పేపర్లు
- ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తీర్ణత సాధ్యం
- గత ఏడాది కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ విద్యార్థుల సత్తా


ప్రత్యేక తరగతులకు హాజరైన పదోతరగతి విద్యార్థులు

చీరాల అర్బన్‌: విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలంటే పదోతరగతి తొలిమెట్టు. పదోతరగతిలో మంచి మార్కులు సాధిస్తే ఆ తర్వాత చదివే ఉన్నత విద్యలో రాణిస్తారు. మార్చి 17 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దీంతో పదోతరగతి విద్యార్థులు కసరత్తు చేస్తున్నారు.

ఉపకరిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులు

పదోతరగతి పరీక్షల నేపథ్యంలో పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. చీరాల నియోజకవర్గంలో చీరాల మండలంలో 15 ఉన్నత పాఠశాలలున్నాయి. వేటపాలెం మండలంలో ఎనిమిది ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో సుమారు 1200 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాయనున్నారు. పదోతరగతి పరీక్షలకు ప్రత్యేకంగా యాక్షన్ ప్లాన్‌ను నిర్దేశించి తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8.15 నిమిషాల నుంచి 9.15 నిమిషాల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రీఫైనల్ పరీక్షలను నిర్వహించారు. అలానే పాఠశాల పని వేళల్లో సబ్జెక్టులపై ఉపాధ్యాయుల పర్యవేక్షణలో తరగతులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరచారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణతా శాతాన్ని సాధించారు.

17 నుంచి 31వ తేదీ వరకు

పదోతరగతి పరీక్షలు మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సాంఘిక శాస్త్రం పరీక్షను రంజాన్ పర్వదినాన్ని బట్టి మార్చి 31న లేదా ఏప్రిల్ ఒకటో తేదీన నిర్వహించాలనేది ప్రభుత్వం ప్రకటిస్తుంది. ప్రతి సబ్జెక్టుకు రెండు పేపర్లు ఉండేవి. సెలవు రోజులు తప్ప వరుసగా పరీక్షలు జరిగేవి. దీంతో విద్యార్థులు ఒత్తిడికి గురయ్యేవారు. ప్రస్తుతం ఆరు సబ్జెక్టులకు ఏడు పేపర్లుంటాయి. సైన్స్ సబ్జెక్టు తప్ప మిగిలిన అన్ని సబ్జెక్టులకు 100 మార్కులకు ఒక రోజే పరీక్ష జరుగుతుంది. భౌతికశాస్త్రం, జీవశాస్త్రాలకు ఒక్కో సబ్జెక్టుకు 50 మార్కులకు రెండు రోజుల పాటు పరీక్షలు నిర్వహిస్తారు. గతంలో ఒక పరీక్ష పూర్తయిన మరుసటి రోజు మరో పరీక్ష రాయాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రతి పరీక్షకు మధ్య ఒక రోజు విరామం ప్రకటించడంతో ఉత్తీర్ణత శాతం పెంపునకు ఉపకరిస్తుందని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మధ్యలో సెలవులు కలవడం ద్వారా ఒక్కోసారి రెండు మూడు రోజులు సెలవులు వచ్చాయి. తగిన సమయం రావడంతో పాఠ్యాంశాల పునశ్చరణకు అవకాశం ఉంటుంది.

> **ఒత్తిడి, భయాన్ని విడనాడాలి**
>
> 
>
> పదోతరగతి పరీక్షలంటే ముందుగా విద్యార్థుల్లో భయాందోళన ఉంటుంది. కానీ ధైర్యంగా పరీక్ష రాయాలి. పరీక్ష రాసే మూడు గంటలు శ్రద్ధతో మెరుగ్గా రాసే ప్రయత్నం చేయాలి. కొట్టివేతలు, తప్పులు లేకుండా రాయాలి.
>
> – భవనం బద్రిరెడ్డి, హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్ అక్కాయపాలెం

అక్షరం బాగుంటేనే..

పరీక్షల విషయంలో చేతి రాతకు ఎంతో ప్రాధాన్యం ఉంది. కళ్ళకు ఇంపుగా కనిపించే అక్షరాలు వారిని ఇట్టే ఆకట్టుకుంటాయి. జవాబు పత్రాలు మూల్యాంకనం చేసే వారిని మార్కులు వేసేలా ప్రేరేపిస్తాయి. పేజీకి 16 నుంచి 18 లైన్లకు మించకుండా రాయాలి. మొదటి వరసలో ఎంత బాగా రాశారో చివరి వరకు అదే గుండ్రని అక్షరాలతో కొనసాగించాలి. తెలుగు, ఇంగ్లిషు, హిందీ సబ్జెక్టుల్లో లెటర్ రైటింగ్‌ను ఒక పేజీలో వచ్చేలా రాయాలి. గణితంలో అంకెలు స్పష్టంగా ఉండాలి. కొట్టివేతలు వస్తే మార్కులు తగ్గిస్తారు. గ్రాఫ్‌ను చక్కగా గీయాలి. సైన్స్‌లో బొమ్మలు వేసే సమయంలో కష్టమైన వాటిని వదిలేసి సులభంగా ఉన్న వాటిని ఆకర్షణీయంగా గీయాలి. ముందుగా పరీక్షలంటే ఉన్న భయాన్ని వీడి ధైర్యంగా ఉండాలి.

> **ఇదే తొలిసారి**
>
> 
>
> పదోతరగతి పరీక్షల నిర్వహణకు ఒక్కో రోజు విరామం రావడం ఇదే తొలిసారి. ఈ సమయం విద్యార్థులకు చాలా ఉపయోగపడుతుంది. దూర ప్రాంతాల విద్యార్థులు పరీక్ష కేంద్రం నుంచి ఇంటికి చేరుకోవడానికి సాయంత్రం అవుతుంది. పరీక్షల మధ్య విరామం రావడం విద్యార్థులకు మేలు చేకూరుతుంది.
>
> – పి.భానుచంద్రమూర్తి, సైన్స్ ఉపాధ్యాయులు, చీరాల

తూకంలో తేడా చేస్తే చర్యలు తప్పవు


చికెన్ దుకాణంలో కాటా తూకం రాళ్లను పరిశీలిస్తున్న తూనికల అధికారి నాగేశ్వరరావు

చీరాల టౌన్‌: ఎమ్మార్పీ కంటే అదనంగా వస్తువులను అమ్మకాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ అధికారి కె.నాగేశ్వరరావు హెచ్చరించారు. శనివారం చీరాల డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లోని వ్యాపారుల కాటాలను తనిఖీ చేయడంతో కిరాణా దుకాణాలు, చికెన్ దుకాణాలు, చిల్లర దుకాణాలు, ఫర్టిలైజర్ షాపులు, కూల్‌డ్రింక్ షాపులను తనిఖీ చేశారు. తూకం రాళ్ల, కాటాల కాలపరిమితి, అనుమతులు, ఇతర ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ప్రతి వ్యాపార దుకాణంలోని కాటాలను ఏడాదికి ఒక్కసారి రెన్యువల్ చేయించుకోవాలన్నారు. కాటా తూకంలో అవకతవకలు లేకుండా వ్యాపారం చేయాలన్నారు. అక్రమాలకు పాల్పడి వస్తువులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. చీరాల డివిజన్ పరిధిలోని 13 మండలాల్లో గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఫిబ్రవరి 20 వరకు చికెన్ దుకాణాలు, కూల్‌డ్రింక్ షాపులు, ఫర్టిలైజర్ షాపులు, ఎండు చేపలు అమ్మకాలు చేసే దుకాణాలు, పలు దుకాణాలపై 342 కేసులు నమోదు చేసి రూ.14.18 లక్షలు జరిమానా విధించామన్నారు. ప్రతి వ్యాపారి తూకాల్లో తేడాలు లేకుండా చూసుకోవాలని అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కాబూలీ శనగతో అధిక దిగుబడులు


తిమిడెదపాడులో శనగ పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు

తిమిడెదపాడు (కారంచేడు): కాబూలీ రకం శనగ వంగడాలను వినియోగించడంతో రైతులు మంచి దిగుబడులు సాధించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని గుంటూరు లాం పరిశోధనా కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ డీఈ శివన్నారాయణ, ఏడీఆర్ డాక్టర్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్, బాపట్ల డాట్ సెంటర్ కోఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ మురళీధర్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని తిమిడెదపాడు గ్రామానికి చెందిన రాష్ట్రీయ ఉత్తమ రైతుగా అనేక మార్లు అవార్డులు సొంతం చేసుకున్న బోడావుల లక్ష్మీనారాయణ ఈ ఏడాది సాగు చేసిన శనగ చేలను వారు పరిశీలించి పలు రకముల వంగడాల ఉత్పత్తులు, వాటి స్థితిగతులను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఈ ఏడాది కొత్తగా వచ్చిన వంగడాలలో కాబూలీ రకాలలో ఎన్‌బీఈ–జీ810, ఎన్‌బీఈ–జీ833 రకాలతో పాటు, దేశవాళీ రకాలలో ఎన్. 1267 శనగ పంటలను సాగు చేశారన్నారు. వీటిలో కాబూలీ రకాలుగా పరిచయం అయిన జీ 810, జీ 833 రకాల విత్తనాలు రాబోవు రోజుల్లో రైతులకు మంచి లాభదాయకంగా ఉంటాయన్నారు. ఈరకం విత్తనాలు ఈ ప్రాంత వాతారణానికి అనుకూలంగా, గింజ నాణ్యత, అధిక దిగుబడులు, అధిక తెగుళ్ల నిరోధక శక్తిని కలిగి ఉంటాయన్నారు. ఇవి ప్రత్యేకంగా ఎండు తెగుళ్ళను సమర్ధవంతంగా ఎదుర్కొంటాయన్నారు. వీటితో ఆయన సాగు చేసిన నంద్యాల రకమైన ఎన్ 1267 రకం విత్తనాలు కూడా రోగ నిరోధక శక్తి కలిగి, అధిక దిగుబడులు వస్తాయన్నారు. రాబోవు కాలంలో ఈ రకం వంగడాలను రైతులకు అందించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. తెగుళ్లను తంటుకుంటూ, మంచి దిగుబడులు ఇచ్చే శనగ రకం విత్తనాలను ఎంపిక చేసుకోవడంలో లక్ష్మీనారాయణ కృషిని అభినందించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె. సుధీర్‌బాబు, రైతులు బోడావుల వెంకటనారాయణ, ఆలపాటి సుబ్రమణ్యం, కొమ్మాలపాటి విశ్వేశ్వరావు, బాబూరావు, వ్యవసాయ సహాయకులు వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్‌కు పరామర్శ


గాదె మధుసూదనరెడ్డితో వైఎస్సార్ సీపీ నాయకులు

పర్చూరు(చినగంజాం): పర్చూరు మండలంలోని ఇనగల్లు గ్రామానికి చెందిన పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నరిశెట్టి ఆచార్యులును నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన ఇంటికి స్వయంగా వెళ్ళి ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి ఆరా తీశారు. అలాగే దేవరపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోకల కృష్ణమోహన్‌ను కుమార్తెకు ఇటీవల వివాహం కావడంతో నూతన వధూవరులను ఆశీర్వదించారు. చెరుకూరు గ్రామ సర్పంచ్ పేరం సుబ్బారావు, ఎంపీటీసీ వెంకటరెడ్డి, గొల్లపూడి సర్పంచ్ రామకృష్ణ, రమణాయ పాలెం సర్పంచ్ అడపా వెంకటరెడ్డి, పర్చూరు వైస్ ఎంపీపీ పాలేటి వీరయ్య ఉన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కఠారి అప్పారావు, ఉప్పలపాటి అనిల్, జగన్నాథం, నాయకులు లంకా శివ, రావూరి వేణు, షేక్ అజీమ్, ముప్పల రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వందేళ్ల నాటి సీతారామాలయం కూల్చివేత


చినగంజాంలో సీతారామాలయాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

చినగంజాం: మండల కేంద్రం అయిన చినగంజాంలో శతాబ్దాల కాలం నాటి సీతా రామాలయాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం కూల్చివేశారు. గత కొన్ని దశాబ్దాలుగా ధూప,దీప నైవేద్యాలు లేక శిథిలావస్థలో కునారిల్లుతోంది. నూతన నిర్మాణాన్ని ప్రారంభించేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు. వలివేటి రామానుజం, మోటుమర్రి రామసుబ్బారావు పాల్గొన్నారు.

ఏబీసీ కాలువలోకి దూసుకెళ్లిన బైక్

బల్లికురవ: మలుపులో బైకు అదుపుతప్పి అద్దంకి బ్రాంచ్ కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన శనివారం బల్లికురవ– అద్దంకి ఆర్అండ్‌బీ రోడ్డులోని వల్లాపల్లి గ్రామ సమీపంలో జరిగింది. ఇరువురు యువకులకు స్వల్పగాయాలయ్యాయి. ఈత రావటంతో ప్రమాదం బారినుంచి తప్పించుకుని కాలువలోనుంచి బయటి వచ్చారు. స్థానికుల సహాయంలో బైకును బయటకు తీయించుకుని వెళ్లిపోయారు. ఇక్కడే మలుపు ఉండటం సింగిల్ బ్రిడ్జికి ఇరువైపుల యాంగిలర్లు లేకపోవటం వల్ల తరచు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గత 10 సంవత్సరాలుగా సుమారు 25 మంది వరకు ఇక్కడ కాలువలో పడి చనిపోగా 40 మంది వరకు గాయాల పాలయ్యారు. బ్రిడ్జి అభివృద్ధి పనులు ప్రతిపాదనలకే పరిమితం అవుతున్నాయి.

కారంచేడు సొసైటీ మాజీ అధ్యక్షుని మృతి


జాగర్లమూడి శివరాంప్రసాద్ (ఫైల్)

కారంచేడు: ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తూ కారంచేడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత జాగర్లమూడి శివరాంప్రసాద్ (55) నిద్రలోనే మృతిచెందాడు. హైదరాబాద్ నుంచి కారంచేడు వచ్చే ట్రావెల్స్ బస్సులో సీటు రిజర్వ్ చేసుకున్నాడు. శనివారం ఉదయం ఆయన కారంచేడులో దిగాల్సి ఉండగా ఆయన దిగలేదు. చీరాలకు వచ్చిన తరువాత కూడా ఆయన దిగకపోవడంతో గమనించిన బస్సు సిబ్బంది ఆయన మృతిచెందినట్లు గుర్తించారు. ఆయన 2023 ప్రాంతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకునిగా, కారంచేడు సొసైటీ అధ్యక్షునిగా పనిచేశారు. ఈయనకు భార్య, అమెరికాలో చదువుకుంటున్న కుమార్తె ఉన్నారు. మృతదేహానికి జాగర్లమూడి అనీల్‌బాబు, యార్లగడ్డ సుబ్బారావు, జాగర్లమూడి సందీప్ నివాళులర్పించారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.

ఆల్బెండజోల్‌తో చిన్నారులకు ఆరోగ్యం

చీరాల టౌన్‌: రోగాలకు కారణమయ్యే నులిపురుగుల నివారణకు ప్రభుత్వం పన్నెండేళ్లలోపు చిన్నారులకు అందించే ఆల్‌బెండజోల్ మాత్రలను విధిగా తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. శనివారం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులకు పీహెచ్‌సీ ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. మూడు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

యూనియన్ బ్యాంక్ విశిష్ట సేవలు

బల్లికురవ: మండలంలోని పెదఅంబడిపూడి గ్రామంలోని యూనియన్ బ్యాంకు ద్వారా రైతులకు విశిష్టసేవలు అందిస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ అజిత్ కుమార్ తెలిపారు. శనివారం బల్లికురవలోని నాలుగు రోడ్ల కూడలిలో బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహనతో కూడిన కరపత్రాలు పంపిణీ చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కారంచేడు: గ్రామాల్లో శాంతి, భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవ్వరూ ప్రయత్నించవద్దని ఎస్ఐ వి. వెంకట్రావు సూచించారు. శనివారం రాత్రి ఆయన మండలంలోని స్వర్ణ గ్రామంలో నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమంలో గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో ప్రతి ఒక్కరు ఐక్యతగా, కట్టుబాట్లతో ఉండాలని ఆయన సూచించారు.

ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


స్వర్ణ కార్యక్రమంలో సిబ్బంది

స్వర్ణ(కారంచేడు): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ కె. నేతాజీ అన్నారు. శనివారం పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలంటే ప్రతి ఒక్కరిలో అవగాహన ఉండాలన్నారు. రెండు రకాల డస్ట్‌బిన్‌లను వినియోగించుకోవాలన్నారు. స్వర్ణ గ్రామంలో కార్యదర్శి చక్రవర్తి స్పెషల్ డ్రైవ్‌లో దగ్గరుండి పారిశుద్ధ్య కార్యక్రమాలను చేయించారు.

వ్యాధులపై సర్వే

యద్దనపూడి: కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు మండల పరిధిలోని గ్రామాల్లో సంక్రమిత , ఆసంక్రమిత వ్యాధుల సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి శ్రీహర్ష తెలిపారు. సంవత్సరం పాటు జరిగే ఈసర్వే ద్వారా వైద్య ఆరోగ్యశాఖలో కేంద్ర ప్రభుత్వం నూతన ప్రణాళికతో సేవలందించేందుకు దోహదపడుతుందన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు

చీరాల: వేటపాలెం మండలం అక్కాయపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని, సరస్వతీపూజ, పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని శనివారం పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు భవనం బద్రిరెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, అనూరాధ, అంజమ్మ, బాల సుబ్రహ్మణ్యం, ఖమరున్నీసా బేగం, రమణ, విద్యా కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధికారులు సమర్థవంతంగా పని చేయాలి


సమావేశానికి హాజరైన శాఖల అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల అర్బన్‌: చీరాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులు అందరూ సమర్థవంతంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో నియోజకవర్గంలోని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చీరాల నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రజలు మనకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇళ్ళు లేని పేదలను గుర్తిస్తే అందరికీ ఇళ్ళు మంజూరు చేస్తామన్నారు. చీరాల రూరల్ ప్రాంతంలో రైతులకు వ్యవసాయానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ప్రాజెక్టులు బాగుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే రెండు ఇరిగేషన్ ప్రాజెక్టులు మంజూరయ్యాయని, రైతులందరినీ ఈ క్రాప్‌లో నమోదు చేయాలని, ఎరువులకు, విత్తనాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. అసైన్డ్ భూములు ఈ క్రాప్‌లో నమోదు చేయడం కుదరలేదని వ్యవసాయశాఖ ఏడీఏ కె.భాస్కరరావు తెలపగా ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే నియోజకవర్గానికి రెండు సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు కూడా సోలార్ ప్లేట్లు బిగిస్తామన్నారు. గోకులం షెడ్లు చీరాల మండలంలో 26కు గాను 25 మంజూరయ్యాయన్నారు. అలానే వేటపాలెం మండలంలో 47 మంజూరు కాగా 27 పూర్తి చేశామన్నారు. సమావేశంలో ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, హౌసింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.